మంజీరా పైప్‌లైన్ పనుల్లో జాగ్రత్తలేవి..?



హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో మంజీరా పైప్‌లైన్ రోడ్డులో గుంతపడ్డ దృశ్యం



మంజీరా రోడ్డులో దిగబడ్డ లారీ

- 6 కిలోమీటర్లకు.. కిలోమీటర్ పనులు పూర్తి
- వాహనదారులకు తప్పని ప్రమాదాలు
- కనిపించని సూచిక బోర్డులు

హఫీజ్‌పేట్ : మంజీరా పైప్‌లైన్ లీకేజీలతో స్థానికంగా, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరమ్మతులు చేసినా మరోచోట లీకేజీ అవుతున్నాయి. లింగంపల్లి చౌరస్తా నుంచి హఫీజ్‌పేట్ మంచినీటి రిజర్వాయర్ వరకు 1964 సంవత్సరంలో పైప్‌లైన్ వేశారు. దశాబ్దాలుగా సింగూర్ నుంచి వచ్చే మంజీరా నీరు నగర దాహార్తిని తీరుస్తోంది. కాగా మంజీరా పైప్‌లైన్ రోడ్డులో లీకేజీలతో పెద్ద గుంత ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డులో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇటీవల చందానగర్, హఫీజ్‌పేట్ డివిజన్ల ప్రజలు మంజీరా నూతన పైప్‌లైన్ వేయాలని ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రాలు అందించారు. దీంతో శాశ్వత పరిష్కార దిశగా రూ.41 కోట్లతో నూతన పైప్‌లైన్ ఏర్పాటుకు గత ఎన్నికల ముందు శంకుస్థాపన చేశారు. నూతన పైప్‌లైన్ నిర్మాణంతో సమస్య తీరనుంది.

రూ.41 కోట్లు నిధులతో..

- లింగంపల్లి నుంచి హఫీజ్‌పేట్ మంచినీటి రిజర్వాయర్ వరకు సుమారు 6 కిలోమీటర్లు నూతన పైప్‌లైన్ నిర్మాణానికి రూ.41 కోట్లు నిధులు విడుదలయ్యాయి.
- ఇప్పటి వరకు ఒక కిలోమీటర్ మేర పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయి.
- మిగతా 5 కిలోమీటర్లు జూన్ నాటికి పూర్తికానుంది.
- పైప్‌లైన్ పనుల వలన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- పనులు చేపట్టేటప్పుడు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు సూచిస్తున్నారు
- రోడ్డుపై ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని పనులు జరుగుతున్న ఏరియాలో వాహనాల రాకపోకలు నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.





పైప్‌లైన్ పనులు పూర్తి చేసిన చోట సూచిక బోర్డులు పెట్టకపోవడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్న దృశ్యాలు

మూడునెలల్లో పనులు పూర్తి



లింగంపల్లి – హఫీజ్‌పేట్ మంచినీటి రిజర్వాయర్ వరకు సుమారు 6 కిలోమీటర్లు పైప్‌లైన్ నిర్మాణానికి రూ.41 కోట్లు ఖర్చు అవుతుంది. ఇప్పటి వరకు కిలోమీటర్ పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు మూడు నెలలో పూర్తి కానున్నాయి.

– శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలి



నూతన మంజీరా పైప్‌లైన్ నిర్మాణం చాలా సంతోషకరం. పనులు చేసేటపుడు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి. దశాబ్దాల సమస్యకు పరిష్కారం దొరకడం శుభసూచకం.

–పద్మారావు, ఆర్టీసీ కాలనీ

సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించాలి

మనూ వీసీ ప్రొ.సయ్యద్ ఐనుల్ హసన్



మాట్లాడుతున్న వీసీ ప్రొ.సయ్యద్ ఐనుల్ హసన్

రాయదుర్గం: భావితరాల కోసం మన సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో నేషనల్ కల్చరల్ ఆడియో విజువల్ ఆర్కైవ్స్ (ఎన్‌సీఏఏ), ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ (ఐజీఎన్‌సీఏ) సహకారంతో ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్(ఐఎంసీ) ఆడియో విజువల్ ఆర్కైవింగ్‌పై మూడు రోజుల వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక మార్పిడి, పరిశోధన, విద్యను పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ఎన్‌సీఏఏ కల్చరల్ ఇన్ఫర్మేటిక్స్ డైరెక్టర్ డాక్టర్ ప్రతాపానంద్ ఝా మాట్లాడుతూ వనరులు, డేటాను ఆర్కైవ్ చేయడంలో సవాళ్ళను ఆయన వివరించారు. రిజిస్ట్రార్ ఇష్తియాక్ అహ్మద్, ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్, రిసోర్స్‌పర్సన్ ఇర్ఫాన్ జుబైరి ప్రసంగించారు. కార్యక్రమంలో నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జగదీశ్వర్‌గౌడ్‌ను కలిసిన నూతన కార్యవర్గ సభ్యులు

నూతన కార్యవర్గం

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియనగర్ ఫేజ్ 1లో కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గంను గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జయసూరి, ఉపాధ్యక్షులుగా మల్లికార్జున్, మల్లేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, జాయింట్ సెక్రటరీ సురేష్, మర్దమ్మ, ట్రెజరర్ శ్రీనివాస్, కల్చరల్ సెక్రటరీ ప్రభ, సభ్యులు సత్యనారాయణ, జగన్‌మోహన్‌రెడ్డి, వాసుదేవ్, బ్రహ్మయ్య, సాంబశివరావు, గణేష్, రమేష్‌లు ఎన్నికయ్యారు. అనంతరం వారు కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వీరందరనీ ఆయన శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జనప్రియ సెంట్రల్ కమిటీ అధ్యక్షులు నల్ల సంజీవరెడ్డి, నాయకులు కృష్ణ, వీరేందర్, సత్యంగౌడ్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులను ప్రోత్సహించాలి

జడ్పీ చైర్మన్ మంజుశ్రీ

రామచంద్రాపురం(పటాన్ చెరు): రామచంద్రాపురం పట్టణంలోని గీతా భూపాల్రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల16వ వార్షికోత్సవంను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 30 మందితో ప్రారంభమైన కళాశాల నేడు 1200 మంది విద్యార్థులు చదువుతూ ఉండడం సంతోషమన్నారు. కళాశాలలో ఆడిటోరియం నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాన్ని అందిస్తానని అన్నారు. మాజీ చైర్మన్ భూపాల్రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత విద్యార్థుల కోసం కళాశాలను నిర్మించానని, తమకు ఉన్నంతలో ఇతరులకు సహాయపడాలన్నారు. అనంతరం వివిధ రంగాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు అతిథులు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పుష్ప నగేష్, సింధు, మెట్టుకుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య ,టీఆర్‌ఎస్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, బాల్రెడ్డి, మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి, ఆదర్శ రెడ్డి, సిబ నరేందర్ రెడ్డి, ఎస్సై శశికాంత్, ప్రిన్సిపల్ ఉమామహేశ్వర్, పటాన్‌చెరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్, పరమేష్ ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ

మేడారం జాతర

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పాపిరెడ్డినగర్, ఆస్‌బెస్టాస్ కాలనీ వద్ద గల శ్రీ సమ్మక్క, శ్రీ సారలమ్మ మేడారం జాతర అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గురువారం సమ్మక్క, సారలమ్మలను గద్దెలపై ప్రతిష్టింపచేశారు. జాతర మహోత్సవం కమిటీ అధ్యక్షుడు శ్రీధర్ పటేల్, చైర్‌పర్సన్స్ భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్ పటేల్, గంగుల రాజిరెడ్డిల ఆధ్వర్యంలో సమ్మక్క, సారలమ్మలకు స్థానికంగా ఉన్న హుడా పార్కు నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీ రేణుకా ఎల్లమ్మ, నల్లపోచమ్మ, శ్రీ వీరాంజనేయ శివాలయం వద్ద నుంచి డప్పు చప్పుళ్ళ, కోలాటాలు, శివసత్తుల వీరంగాల మధ్య అమ్మవార్లను గద్దెలపైకి వేడుకగా తీసుకువచ్చారు. నగరంలోని వివిధ ప్రాంతాల భక్తులు తరలి వచ్చి అమ్మవార్లకు ఒడిబియ్యం, బెల్లం, పట్టువస్త్రాలతో మొక్కులు సమర్పించుకున్నారు. శుక్రవారం ప్రత్యేక వేడుకలు జరుగుతాయని, శనివారం అమ్మవార్ల వన ప్రవేశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పర్వతాలు యాదవ్, బాలు యాదవ్, సాయి కుమార్‌పటేల్, నర్సింగరావు, రాజేంద్రప్రసాద్, శ్రీలత పటేల్, శ్రీకాంత్‌యాదవ్, పాలమూరు భాస్కర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.





వేస్ట్ మెటీరియల్ డంపింగ్‌నకు స్థల పరిశీలన



మాదాపూర్: బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్ డంపింగ్ కోసం మాదాపూర్‌లోని హైటెక్‌సిటీ ఫ్లైఓవర్ కింద స్థలాన్ని గురువారం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహశబరీష్, చందానగర్ డిప్యూటి కమిషనర్ వంశీకృష్ణలు సిబ్బందితో కలసి పరిశీలించారు. నిర్దిష్ట ప్రాంతాలలో డంపింగ్ చేసేందుకు పరిశీలించినట్టు తెలిపారు.

రథోత్సవం



రాయదుర్గం: వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛారణలు..భక్తుల జయజయధ్వానాల నడుమ రంగనాథస్వామి రథోత్సవంను గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

ప్రతిష్ఠాపనోత్సవాలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నేతాజీనగర్ శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారం కనుల పండువగా నిర్వహించారు. ఈ వేడుకలకు తొగుట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామి హాజరై యంత్ర ప్రతిష్ఠ చేశారు. ఉత్సవాల్లో భాగంగా వినాయక, శ్రీ అభయాంజనేయస్వామి, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే బొడ్రాయి ప్రతిష్ఠ చేశారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జీ జగదీశ్వర్‌గౌడ్, ఆలయ ధర్మకర్తలు లేగల సత్యనారాయణ రెడ్డి, లేగల ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు. కాలనీలవాసులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఉప్పరి శేఖర్‌సాగర్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌గౌడ్, ప్రతినిధులు రామేశ్వరమ్మరెడ్డి, మల్లేశం ముదిరాజ్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై సమీక్షా సమావేశం



సమీక్షా సమావేశంలో ఉపకమిషనర్ వంశీకృష్ణ

హఫీజ్‌పేట్ : చందానగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండపంలో శానిటేషన్ అధికారులు, సిబ్బందితో ఉపకమిషనర్ వంశీకృష్ణ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. పారిశుధ్యం మెరుగునకు సిబ్బంది కృషి చేయాలన్నారు. సర్కిల్ పరిధిలో 90కి పైగా బహిరంగ ప్రదేశాలలో చెత్త వేసే ప్రాంతాలను 59కి నివారించామన్నారు. స్థానిక ప్రజలకు చెత్త వేసే ప్రాంతాలపై అవగాహన కల్పిస్తూ దశలవారీగా చెత్త వేసే ప్రాంతాలను ఎత్తి వేస్తామన్నారు. చెత్తను చెత్త ఆటోలకే ఇవ్వాలన్నారు. చెత్త ఆటోల పనితీరును పారిశుధ్యం అధికారులు పర్యవేక్షించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఎంహెచ్‌ఓ డాక్టర్ కార్తీక్, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎస్ఆర్‌పీలు, ఎస్ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిర్మిస్తున్న కల్వర్టు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిర్మిస్తున్న బాక్స్‌టైప్ కల్వర్టు, డ్రైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ.4 కోట్లతో బాక్స్ టైప్ కల్వర్టు, డ్రైన్ పనులను చేపట్టామన్నారు. పనుల్లో వేగం పెంచాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు వీరేశంగౌడ్, మోహన్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు గౌతమ్‌గౌడ్, శ్రీనివాస్ యాదవ్, యాదగిరిగౌడ్, రవి యాదవ్, రామకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు కార్యాలయం.. ఖాళీ కుర్చీలు

మోతీనగర్: ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాలు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. అల్లాపూర్ డివిజన్ వార్డు కార్యాలయంను వివేకానంద నగర్‌లో ఏర్పాటు చేసి అధికారులను సైతం నియమించారు. అలాగే మూసాపేట సర్కిల్ పరిధిలోని మూసాపేట డివిజన్ మోతీనగర్ ఈ సేవ మొదటి అంతస్థులో వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ కూడా అన్ని విభాగాల అధికారులను నియమించారు. ఇటీవల కాలంలో వార్డు కార్యాలయంలో ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయని ఏ పని చేసుకోవాలన్నా సర్కిల్ కార్యాలయానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. కేవలం ఆస్తి పన్ను చెల్లించే వారు మాత్రమే కనిపిస్తుంటారని, వార్డు కార్యాలయం ప్రారంభించే సమయంలో అధికారులు ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని చెప్పారన్నారు. ఎవరూ అందుబాటులో ఉండడం లేదని, అధికారులు అందుబాటులో ఉండే విధంగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అల్లాపూర్ వార్డు కార్యాలయం

అధికారులు స్పందించాలి



గత ప్రభుత్వం ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే ఉద్దేశంతో ప్రతి డివిజన్‌లో వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేయటం బాగుంది. కార్యాలయాల్లో కేవలం కంప్యూటర్ ఆపరేటర్ మాత్రమే ఉంటారని అక్కడికి వెళితే చెబుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే సిబ్బందిని నియమించి ప్రజలకు సౌకర్యవంతమైన పాలన అందించాలి.

– బొంతు హరికృష్ణ, వివేకానందనగర్

నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్: వేసవిని దృష్టిలో పెట్టుకుని మంచి నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం మంచినీటి సరఫరా, యూజీడీ నిర్వహణపై జలమండలి అధికారులు, కార్పొరేటర్లు హమీద్ పటేల్, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజుల రఘునాథ్‌రెడ్డి, జలమండలి అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన మంచి నీటి సరఫరా చేయాలని ఆదేశాలు ఇచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అవసరమైన చోట మంచినీటి పైప్‌లైన్, యూజీడీ పైప్‌లైన్ పనులకు ప్రతిపాదనలు వచ్చాయని పనులు త్వరితగతిన చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు జీఎం రాజశేఖర్, డీజీఎం నాగప్రియ, డీజీఎం శరత్‌రెడ్డి మేనేజర్లు సుబ్రమణ్యం, యాదయ్య, నరేందర్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, పూర్ణేశ్వరి, సునీత, మాజీ కౌన్సిలర్ వీరేశంగౌడ్, మోహన్‌గౌడ్, చందానగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

‘సండే ఈవినింగ్ టాక్’

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం ‘సండే ఈవినింగ్ టాక్’ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో ‘ క్యూ సెరా సెరా–ఎంబ్రాస్ విత్ యాక్సెప్టెన్స్ అండ్ గ్రేస్’ అనే అంశంపై లండన్‌కు చెందిన బీకే గీత ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040 23001234లో సంప్రదించాలి.

మనూ ప్రొఫెసర్‌కు యునెస్కో ఆహ్వానం

రాయదుర్గం: మనూలోని ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్(ఐఎంసీ) డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్‌కు యునెస్కో కెనడా సమావేశానికి ఆహ్వానం అందించింది. డిజిటల్ పర్యావరణంపై కెనడాలోని క్యూబెక్‌సిటీలో మే 2024లో కెనడా ప్రభుత్వం నిర్వహించే రిఫ్లెక్షన్ గ్రూప్ మొదటి సమావేశానికి రిజ్వాన్ పాల్గొంటారు.యునెస్కో ద్వారా ప్రపంచంలోని నలుమూలల నుంచి 18 మంది నిపుణులను ఎంపిక చేయగా అందులో ‘మనూ’ ప్రొఫెసర్‌కు అవకాశం లభించింది.

ప్రజలతో మర్యాద పూర్వకంగా మెలగాలి

- యాంటి నార్కొటిక్ ఏడీజీపీ సందీప్ శాండిల్య



మాట్లాడుతున్న యాంటి నార్కొటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య

గచ్చిబౌలి: విధి నిర్వహణలో ప్రజలతో మర్యాద పూర్వకంగా మెలగాలని యాంటీ నార్కొటిక్ బ్యూరో డైరెక్టర్, ఏడీజీపీ సందీప్ శాండిల్య అన్నారు. గురువారం కొండాపూర్ 8వ బెటాలియన్‌లో ఆర్మ్‌డ్ రిజర్వ్(ఏఆర్) ఎంపికైన 377 మంది కానిస్టేబుళ్లకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సందీప్ శాండిల్య మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరు క్రమ శిక్షణతో మెలగాలన్నారు. శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం, వృత్తి నైపుణ్యం ఉంటేనే విధుల్లో రాణిస్తారన్నారు. కొండాపూర్ బెటాలియన్ కమాండెంట్ సన్నీ మాట్లాడుతూ శిక్షణలో నేర్పించే ప్రతి విషయం అమూల్యమైందేనని అన్నారు. శిక్షణలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్లు డి.సత్యనారాయణ, దేవిదాస్ రాథోడ్, రెహమాన్, నారాయణ దాసు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలని వినతి



జగదీశ్వర్‌గౌడ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆదిత్యనగర్ కాలనీవాసులు

హఫీజ్‌పేట్ : రంజాన్ పండగను పురస్కరించుకొని మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్‌లోని మసీద్‌ల వద్ద కనీస వసతులు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్‌కు కాలనీవాసులు గురువారం వినతి పత్రం అందించారు. జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న మసీద్‌ల వద్ద కనీస వసతుల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆదిత్యనగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పంచమి కాలనీకి చెందిన ఏఎస్ జాన్సన్‌కు అత్యవసర వైద్యచికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి రూ.2.50 లక్షలు ఎల్‌ఓసీ పత్రాలను గురువారం జగదీశ్వర్‌గౌడ్ కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బాషిపాక యాదగిరి, బసంత్‌రాజ్, రాములు తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ ఆమదయ కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామ యూటర్న్ హనుమాన్ దేవస్థానం పక్కన శ్రీనివాస్ ఆటో మెకానిక్ షాప్ సమీపంలో గత ఏడాది అక్టోబర్ 10వ తేదీన 60 సంవత్సరాలు వయసు గల గుర్తుతెలియని వృద్ధుడిని గుర్తుతెలియని వ్యక్తులు లారీలో తీసుకొచ్చి వదిలి వెళ్లారు.అయితే ఆ వృద్ధుడు పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తుండటంతో స్థానికులు 108 వాహనంకు సమాచారం ఇచ్చారు. దీంతో చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ క్రమంలో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు.సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమర్టం కోసం తరలించి,మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే పటాన్‌చెరు పోలీసులను సంప్రదించాలన్నారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం



విజయ్‌కుమార్ (ఫైల్)

హఫీజ్‌పేట్ : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. చందానగర్ పోలీసులు తెలిపిన ప్రకారం .. మద్యానికి బానిసైన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఏ.విజయ్‌కుమార్ (45) చందానగర్ అపర్ణహిల్ పార్క్ రోడ్డు ఫ్రెష్ మార్కెట్ వద్ద ఉంటూ వంట మనిషిగా పని చేస్తున్నాడు. 6 నెలల నుంచి విజయ్‌కుమార్ మద్యంకు బానిసై నిత్యం భార్య సత్యవతితో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో 8వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మద్యం సేవిస్తుంటే భార్య సత్యవతి నిలదీయడంతో ఇద్దరు గొడవపడ్డారు. పనికి వెళ్తున్నానంటూ ఇంటి నుంచి బయటకు వెళ్ళాడు. తిరిగి రాకపోవడంతో తెలిసిన వారి వద్ద, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో గురువారం చందానగర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

భార్యతో గొడవపడి..



ప్రేమ్‌నాథ్‌చారి (ఫైల్)

చందానగర్ శివాజీనగర్‌లో ఉంటున్న బొగారం రాజశేఖర్ తండ్రి ప్రేమ్‌నాథ్‌చారి (61) ఈ నెల 20వ తేదీ ఉదయం 11 గంటలకు భార్యతో గొడవ పడి బయటకు వెళ్ళాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో రాజశేఖర్ తండ్రి కోసం బంధువులు, స్నేహితులు, పలు ప్రాంతాలలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం చందానగర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వృద్ధుడి ఒంటిపై తెల్ల షర్ట్, నల్ల ప్యాంటు ధరించాడని, ఎత్తు 5.3 ఉంటాడని కుటుంబ సభ్యులు తెలిపారు.